# రూ.25 లక్షల కోట్లు

## ఎన్డీఏ హయాంలో రైటాఫ్ అయిన రుణాలు • వెల్లడించిన రిజర్వ్ బ్యాంక్

### ఏటా రూ.2.77 లక్షల కోట్ల లోన్లను వదులుకున్న బ్యాంకులు

### గడిచిన 9 ఏండ్లలో మొండి బాకీలుగా 3,973 ఖాతాలు

సామాన్యుల ముక్కుపిండి ఇచ్చిన అప్పుల్ని వసూలు చేసుకుంటున్న బ్యాంకులు.. కార్పొరేట్ల దగ్గర మాత్రం సైలెంటైపోతున్నాయి.

ఏకంగా లక్షల కోట్ల రూపాయలనే రైటాఫ్ చేసేస్తున్నాయి. ప్రస్తుత నరేంద్ర మోదీ సర్కారు హయాంలోనే రూ.25 లక్షల కోట్ల రుణాలు రైటాఫ్ అయ్యాయి మరి.

కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వ పెద్దల అండదండలుండటంతో బ్యాంకర్లు.. నష్టపోతున్నామని తెలిసినా ఏం చేయలేని పరిస్థితి నెలకొంటున్నదన్న అభిప్రాయాలు ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

కేంద్రంలో కొలువుదీరే ప్రభుత్వమేదైనా దేశంలోని బ్యాంకుల తలరాత మాత్రం మారడం లేదు. ఏండ్లు గడుస్తున్నకొద్దీ పరిస్థితులు అంతకంతకూ దిగజారిపోతుండటం ఇప్పుడు భారతీయ బ్యాంకిం గ్ వ్యవస్థనే కాదు.. యావత్తు దేశ ఆర్థిక వ్యవస్థనే కలవరపాటుకు గురిచేస్తున్నది. 2014 ఏప్రిల్ మొదలు ఈ ఏడాది మార్చి ఆఖరుదాకా బ్యాంకులు ఏకంగా రూ.25 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ (ఓ రకంగా దీన్ని మాఫీ అనే చెప్పవచ్చు) చేశాయి. ఈ మేరకు సూరత్‌కు చెందిన సామాజిక కార్యకర్త సంజయ్ ఎజ్‌హవా సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద దాఖలు చేసిన పిటిషన్‌కు ఆర్బీఐ తాజాగా తెలియజేసింది. దీంతో ఇప్పుడిది హాట్ టాపికైంది. దేశవ్యాప్తంగా భారీ స్థాయి లో చర్చలకూ దారితీస్తుండగా.. పెద్ద ఎత్తున రాజకీయ దుమారం సైతం రేగుతున్నది.

**రాజకీయ జోక్యం వల్లే..**

ఇంతగా రైటాఫ్ జరిగిన ఈ కార్పొరేట్ రుణాల్లో రాజకీయ జోక్యం ఉందన్న విమర్శలు ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్నాయి. కేంద్రంలోని రాజకీయ పెద్దల అండదండలతోనే కార్పొరేట్లు ఇష్టారీతిన బ్యాంక్ రుణాలు తీసుకున్నారని, చివరకు అదే రాజకీయ నాయకుల జోక్యంతో తప్పించుకున్నారని, ఫలితంగా మునిగింది బ్యాంకులేనన్న విమర్శలు ప్రస్తుతం గట్టిగా వ్యక్తమవుతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.10.41 లక్షల కోట్ల రుణాల్ని రైటాఫ్ చేయగా, మరో రూ.14.53 లక్షల కోట్లు షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు రైటాఫ్ చేశాయి. దీంతో గడిచిన తొమ్మిదేండ్లకుపైగా కాలంలో రైటాఫ్ అయిన మొత్తం లోన్లు రూ.24.95 లక్షల కోట్లకు చేరాయి. అంతేగాక యూపీఏ 11 ఏండ్ల హయాంలో జరిగిన రైటాఫ్ రుణాల కంటే గత 9 ఏండ్లలో జరిగినవే 810 శాతం ఎక్కువని తేలడం ఇక్కడ గమనించదగ్గ అంశం.

**సామాన్యులపై భారం**

మోదీ హయాంలో బ్యాంకులు రైటాఫ్ చేసిన ఈ రూ.25 లక్షల కోట్ల రుణ భారం.. అంతిమంగా సామాన్యులు, రైతులు, చిన్న చిన్న రిటైల్ రుణాలు తీసుకున్నవారిపైనే పడుతుందని బ్యాంకింగ్ రంగ పెద్దలే చెప్తుండటం ఇప్పుడు అత్యంత ఆందోళన కలిగిస్తున్నది. ఈ మొత్తం వ్యవహారంలో బడా నేతలు, పారిశ్రామికవేత్తలే లాభపడ్డారు మరి. నిజాయితీగా తీసుకున్న రుణాల్ని చెల్లించే మధ్యతరగతిపై కఠినంగా వ్యవహరించే బ్యాంకర్లు.. కార్పొరేట్లపట్ల మాత్రం ఉదాసీన వైఖరినే ప్రదర్శిస్తున్నారు. మరోవైపు దేశంలో వేల కోట్ల అప్పులు తీసుకుని.. వాటిని ఎగవేసి విదేశాలకు పారిపోయిన కార్పొరేట్లను పట్టుకునే విషయంలోనూ మోదీ సర్కారు తీరు అభ్యంతరకరంగా ఉందంటున్నారు మెజారిటీ ఆర్థిక నిపుణులు. ఇప్పటిదాకా వసూలైనదే ఇందుకు అద్దం పడుతున్నది. అలాగే బ్యాంకులపై నమ్మకంతో డిపాజిట్లు చేసిన సామాన్యుల కష్టార్జితమే ఇదంతా అన్న విషయం కేంద్ర ప్రభుత్వానికి గుర్తుందా అని ప్రశ్నిస్తున్నారు. *–బిజినెస్ డెస్క్*

**2014-15 నుంచి 2022-23 వరకున్న తొమ్మిదేండ్లలో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు రైటాఫ్ చేసిన రూ.25 లక్షల కోట్ల అప్పుల్లో కేవలం రూ.2.5 లక్షల కోట్లే (10 శాతం) వసూలయ్యాయి. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఈ బాకీల వసూలుకు ఎందుకు కఠిన చర్యలు తీసుకోలేకపోతున్నదన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.**


**మొండి బకాయిల మదింపులో బ్యాంకుల సహాయార్థం సెంట్రల్ రిపాజిటరీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఆన్ లార్జ్ క్రెడిట్స్ (సీఆర్ఐఎల్‌సీ) వ్యవస్థను ఆర్బీఐ 2014లో ఏర్పాటు చేసింది. దీని ప్రకారం ఈ జూన్ నాటికి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు రూ.5 కోట్లకుపైగా ఉన్న 3,973 రుణ ఖాతాలు ఎన్పీఏలుగా తేలాయి.**

**2003-04 నుంచి 2013-14 వరకు 11 ఏండ్లపాటు కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ హయాంలో రూ.3.76 లక్షల కోట్ల లోన్లు రైటాఫ్ అయ్యాయి. ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.1.58 లక్షల కోట్లు, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు రూ.2.17 లక్షల కోట్లు రైటాఫ్ చేశాయి.**

**కాంగ్రెస్ నేతృత్వంలోని 11 ఏండ్ల యూపీఏ ప్రభుత్వ పాలనలో ఏటా సగటున రూ.34,192 కోట్ల రుణాలు రైటాఫ్ అయ్యాయి.**

**బీజేపీ సారథ్యంలోని 9 ఏండ్ల ఎన్డీఏ సర్కారు హయాంలో ప్రతి సంవత్సరం సగటున రూ.2.77 లక్షల కోట్ల లోన్లను రైటాఫ్ చేశారు.**

**మొత్తం యూపీఏ పాలనలో రైటాఫ్ అయిన లోన్లు.. మోదీ సర్కారు హయాంలో కేవలం 17 నెలల్లో రైటాఫ్ అయిన రుణాలకు సమానం కావడం గమనార్హం.**




## గ్రాన్యూల్స్ ఔషధానికి అమెరికా ఓకే


హైదరాబాద్, అక్టోబర్ 19: గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన మరో ఔషధానికి అమెరికా నియంత్రణ మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గుండెల్లో మంట, కడుపులో గ్యాస్‌ను నివారించే ఎసోమెప్రజోల్ మెగ్నీషియంకు జనరిక్ వెర్షన్‌ను అక్కడి మార్కెట్లో విడుదల చేయడానికి అమెరికా నియంత్రణ మండలి యూఎస్‌ఎఫ్‌డీఏ అనుమతినిచ్చినట్టు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఈ క్యాప్సల్స్ 20 ఎంజీ, 40 ఎంజీల్లో లభించనున్నది. ప్రస్తుతం అక్కడి మార్కెట్లో ఎసోమెప్రజోల్ మెగ్నీషియం అమ్మకాలు 168 మిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నది.

## ఈక్విప్స్‌లో తగ్గనున్న ప్రమోటర్ల వాటా

హైదరాబాద్, అక్టోబర్ 19: ఈక్విప్స్ సోషల్ ఇంప్యాక్ట్ టెక్నాలజీస్‌లో ప్రమోటర్లు తమ వాటాను 7 శాతం తగ్గించుకోనున్నారు. ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) రూట్‌లో 92.78 లక్షల షేర్లను ఒక్కో షేరును రూ.26.4 చొప్పున విక్రయించనున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ విక్రయం ఈ నెల 20న నాన్-రిటైల్ ఇన్వెస్టర్లకోసం, 23న రిటైల్ ఇన్వెస్టర్ల కోసం కేటాయించనున్నది. గత నెలలోనే ఈ వాటాను విక్రయించాల్సి ఉండగా, మార్కెట్ పరిస్థితులు నిరాశాజనకంగా ఉండటంతో వాయిదావేసింది.

## సైయెంట్ ఆశాజనకం

హైదరాబాద్, అక్టోబర్ 19: సైయెంట్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.183.6 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.79.1 కోట్ల లాభంతో పోలిస్తే 66 శాతం వృద్ధి కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 27.38 శాతం అధికమై రూ.1,778.5 కోట్లకు చేరుకున్నది. గత త్రైమాసికంలో డిజిటల్, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలకి చెందిన 5 అతిపెద్ద ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు పేర్కొంది. రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.



## లీటర్ పెట్రోల్ రూ.25కే!

### బయో-ఇథనాల్ వినియోగంతో సాధ్యమే

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: ఇథనాల్ ఆధారిత వాహనాల వినియోగంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ క్రమంలోనే ఇథనాల్‌ను వాడుకొంటే 25 రూపాయలకే లీటర్ పెట్రోల్‌ను పొందవచ్చని చెప్పారు. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో గరిష్ఠంగా లీటర్ పెట్రోల్ రూ.120 పలుకుతున్నదన్న ఆయన.. 60 శాతం విద్యుత్తు, 40 శాతం బయో-ఇథనాల్ మిశ్రమంతో ఇంధన ఖర్చును పెద్ద ఎత్తున తగ్గించుకోవచ్చని తెలిపారు. ఇథనాల్ వాడకంతో రైతులకు కూడా భారీ ప్రయోజనం చేకూరుతుందని, ముడి చమురు దిగుమతుల కోసం ఏటా ఖర్చు చేసే లక్షల కోట్ల రూపాయలనూ మిగుల్చుకోవచ్చని వివరించారు. కాలుష్యం కూడా బాగా తగ్గుతుందని పేర్కొన్నారు. కాగా, ఇథనాల్ ఓ పునరుత్పాదక ఇంధనం. రకరకాల మొక్కల నుంచి దీన్ని ఉత్పత్తి చేస్తారు. వివిధ మిశ్రమాలతో కలిపి వాహన ఇంధనంగా దీన్ని ఉపయోగించవచ్చు. దేశీయ ఆటో రంగ కంపెనీలు ఇథనాల్ ఆధారిత వాహనాలను ఉత్పత్తి చేసే దిశగా అడుగులు వేయాలని మంత్రి కోరుతున్నారు. అయితే మూడున్నర నెలల క్రితం ఈ ఏడాది జూలైలోనూ గడ్కరీ.. ఇథనాల్ ప్రయోజనాలను చెప్పగా, అప్పుడు లీటర్ రూ.15కే పెట్రోల్‌ను పొందవచ్చనడం గమనార్హం.

## రిలయన్స్ డిజిటల్లో వన్‌ప్లస్ మడత ఫోన్

హైదరాబాద్, అక్టోబర్ 19: వన్‌ప్లస్ ఓపెన్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో విడుదల కాకముందే వన్‌ప్లస్ ఓపెన్‌కు ఎక్స్‌క్లూజివ్ ఆఫ్‌లైన్ పార్ట్‌నర్ అయిన రిలయన్స్ డిజిటల్ తన స్టోర్స్‌లో ప్రదర్శించింది. అన్ని రిలయన్స్ డిజిటల్ స్టోర్స్‌లోనూ ఈ ఫోన్‌కు అక్టోబర్ 20 నుంచి ముందస్తు బుకింగ్, విక్రయాలు ఈ నెల 27 నుంచి మొదలవుతాయన్నది. ఫోన్‌తో పాటు ఉచితంగా వన్‌ప్లస్ బడ్స్ ప్రొ 2, ఎక్స్‌ఛేంజ్ ఆఫర్లు, యాక్సిడెంటల్ ప్రొటెక్షన్ ప్లాన్, రూ.5,000 వరకూ నో కాస్ట్ ఈఎంఐ, ఐసీఐసీఐ, వన్ కార్డ్‌పై తక్షణ డిస్కౌంట్, రూ.8000 వరకూ ఎక్స్‌ఛేంజ్ బోనస్ ప్రయోజనాలు.

## భీమా వార్షికోత్సవ ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 19: ఆభరణాల విక్రయ సంస్థ భీమా జ్యూవెల్స్ 99వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. గ్రాము బంగారంపై రూ.250 వరకు రాయితీ ఇస్తున్న సంస్థ.. క్యారట్ డైమండ్ జ్యూవెల్లరీపై రూ.20 వేల వరకు, ప్లాటినం జ్యూవెల్లరీపై 10 శాతం వరకు, కిలో వెండిపై రూ.4 వేలు రాయితీ ఇస్తున్నది. వీటితోపాటు ఆభరణాలు కొనుగోలుపై బహుమతిని అందిస్తున్న సంస్థ..ఇన్‌స్టాంట్ క్యాష్ బ్యాక్, గోల్డ్ కాయిన్స్, వెండి నాణేలు, గిఫ్ట్ వోచర్లు గెలుచుకునే అవకాశం కూడా కల్పించింది. లక్కీ డ్రాలో కిలో బంగారం, ఇద్దరు ప్యారిస్ లేదా దుబాయి ప్యాకేజ్ టూర్‌ను గెలుచుకోవచ్చును.



ప్రముఖ ఆభరణాల సంస్థ జోస్ ఆలుక్కాస్ ఆభరణాల కలెక్షన్ 'ఐవి'ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ మాడల్ రాఫెల్లా సిక్వేరా. చిత్రంలో జోస్ ఆలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా, పాల్ జే ఆలుక్కా, జాన్ ఆలుక్కా

## 137 కోట్ల జరిమానా చెల్లించండి

• ఎన్సీపీ ఎమ్మెల్సీకి నోటీసులు

ముంబై: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడినందుకు రూ.137 కోట్ల జరిమానా చెల్లించాలంటూ ఎన్సీపీ ఎమ్మెల్సీ ఏక్‌నాథ్ ఖడ్సే, ఆయన కోడలు, బీజేపీ ఎంపీ రక్షా ఖడ్సేలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. తవ్వకాలకు పాల్పడిన భూమి ఏక్‌నాథ్ ఖడ్సే కుటుంబానికి చెందినప్పటికీ భారీస్థాయిలో మొరం, బ్లాక్ స్టోన్‌లను వెలికితీశారని, దీని కోసం అవసరమైన అదనపు అనుమతిని తీసుకోలేదని అధికారులు పేర్కొన్నారు. 15 రోజుల్లోగా జరిమానాను చెల్లించాలని నోటీసులో తెలిపారు. కాగా దాదాపు నాలుగు దశాబ్దాలపాటు బీజేపీలో కొనసాగిన ఏక్‌నాథ్ ఖడ్సే 2020లో ఎన్సీపీలో చేరారు. దీంతో ఆయనపై కక్ష్యపూరిత చర్యలకు దిగినట్టు వార్తలు వస్తున్నాయి.

## 'ఆర్ఆర్‌టీఎస్' రైళ్లకు నమోభారత్‌గా నామకరణం

న్యూఢిల్లీ: దేశంలో తొలిసారిగా ప్రవేశపెడుతున్న రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టీఎస్) సెమీ హైస్పీడ్ రైళ్లకు 'నమో భారత్'గా నామకరణం చేసినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ కారిడార్‌లోని 17 కిలోమీటర్ల సెక్షన్‌ను ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈనెల 21 నుంచి ఇవి ప్రజలకు అందుబాటులోకి రానున్నట్టు ప్రధాని కార్యాలయం వెల్లడించింది. 180 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీసే ఇవి ప్రతి 15 నిమిషాలకు ఒకటి అందుబాటులో ఉంటాయని పీఎంవో తెలిపింది.

## ప్రజ్ఞాన్ తిరిగి మేల్కొనే అవకాశం

కొచ్చి: చంద్రయాన్-3 సక్సెస్‌తో చరిత్ర సృష్టించిన ఇస్రో.. రోవర్ ప్రజ్ఞాన్‌ను తిరిగి మేల్కొపేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అయితే నిద్రాణ స్థితి నుంచి రోవర్ మేల్కొనే అవకాశముందని ఇస్రో చైర్మెన్ ఎస్ సోమనాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ, 'చంద్రయాన్-3 మిషన్‌లో ల్యాండర్ విక్రమ్, రోవర్ ప్రజ్ఞాన్ నుంచి రావాల్సిన డాటా అంత వచ్చేసింది. అనుకున్న విధంగా పరీక్షలు చేపట్టాం. ప్రస్తుతం నిద్రాణ స్థితి లో ఉంది. తిరిగి తప్పకుండా మేల్కొంటుందన్న ఆశ మాత్రం ఉంది' అని అన్నారు.

# హమాస్‌కు కిమ్ ఆయుధాలు!

### ఇజ్రాయెల్‌పై ఎఫ్-7 రాకెట్ గ్రనేడ్లను ప్రయోగించిన మిలిటెంట్ గ్రూపు

అక్కడ లభ్యమైన ఆయుధాలపై విశ్లేషణ • హమాస్ చెరలో 203 మంది బందీలు

గాజాపై కొనసాగుతున్న ఇజ్రాయెల్ దాడులు • రెండు వైపులా 6 వేలకు పైగా మరణాలు

సియోల్/జెరూసలేం, అక్టోబర్ 19: ఇజ్రాయెల్‌పై దాడికి హమాస్ మిలిటెంట్ గ్రూపు కిమ్ పాలిస్తున్న ఉత్తర కొరియా ఆయుధాలు వినియోగించిందా? ఆ ఆయుధాలు, రాకెట్లతోనే ఈ నెల 7న ఇజ్రాయెల్ భూభాగంపై హమాస్ దాడులకు దిగిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకొన్న ఆయుధాలను దక్షిణ కొరియాకు చెందిన నిపుణులు, అసోసియేటెడ్ ప్రెస్ విశ్లేషించింది. దాడుల్లో భాగంగా హమాస్ ఉత్తర కొరియాకు చెందిన ఎఫ్-7 రాకెట్ ప్రొపెల్లెడ్ గ్రనేడ్‌లను వినియోగించినట్టు ఈ విశ్లేషణ పేర్కొన్నది. పాలస్తీనా మిలిటెంట్ గ్రూపు హమాస్‌కు ఉత్తరకొరియా దీర్ఘకాలంగా మద్దతు తెలుపుతున్నదని ఆయుధ నిపుణుడు జెంజన్ జోన్స్ తెలిపారు. అయితే తాము హమాస్‌కు ఆయుధాలు సరఫరా చేయలేదని ఉత్తర కొరియా తాజా వార్తలను ఖండించింది.

**306 మంది ఇజ్రాయెల్ జవాన్లు మృతి**

మరోవైపు ఈనెల 7న దాడి తర్వాత గాజాలో హమాస్ చెరలో బందీలుగా ఉన్న 203 మంది కుటుంబాలకు వివరాలు తెలియజేశామని ఇజ్రాయెల్ సైన్యం గురువారం వెల్లడించింది. అయితే మొత్తం బందీల సంఖ్యపై కచ్చితమైన సమాచారం లేదని ఐడీఎఫ్ తెలిపింది. హమాస్ దాడిలో 306 మంది జవాన్లు మరణించారని ఆయన తెలిపారు. కాగా, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో ఇప్పటి వరకు హమాస్ మిలిటెంట్లు, ఇజ్రాయెల్ జవాన్లు సహా 6 వేల మందికి పైగా మరణించారు.



*గాజాపై ఇజ్రాయెల్ రాకెట్ దాడి చేయడంతో దట్టంగా కమ్ముకున్న పొగ*

**ఇజ్రాయెల్‌కు అండగా ఉంటాం: సునాక్**

ప్రస్తుత క్లిష్ట సమయాల్లో తమ దేశం ఇజ్రాయెల్‌కు అండగా ఉంటుందని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తెలిపారు. ఇజ్రాయెల్‌లో పర్యటించిన ఆయన ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో భేటీ అయ్యారు. అనంతరం సంయుక్త మీడియా సమావేశం నిర్వహించారు. గాజాలోని మానవతా కారిడార్‌ను తెరువడాన్ని సునాక్ స్వాగతించారు.

**అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడాలి**

గాజాలోని దవాఖానపై జరిగిన దాడిపై భారత్ స్పందించింది. అంతర్జాతీయ మానవతా చట్టానికి కట్టుబడి ఉండాలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి పిలుపునిచ్చారు. సాధారణ పౌరుల మరణాలు, మానవతా సంక్షోభ పరిస్థితిపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తున్నదని పేర్కొన్నారు. గాజాలో గతంలో నలుగురు భారతీయులు ఉండేవారని, ప్రసుత్తం ఆ సంఖ్యపై స్పష్టత లేదన్నారు. ప్రస్తుతం గాజా నుంచి పౌరులను తరలించే పరిస్థితి లేదని, అవకాశం దొరికినప్పుడు వారిని బయటకు తీసుకొస్తామని అరిందమ్ బాగ్చి చెప్పారు.

**బిక్కు బిక్కు మంటున్న పాలస్తీనియన్లు**

గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులను కొనసాగిస్తున్నది. అన్ని ప్రాంతాలపై బాంబులు వేస్తున్నది. ఉత్తర గాజాలోని ప్రజలు దక్షిణాదికి వెళ్లిపోవాలని ఆదేశిస్తూ, దక్షిణ గాజా ప్రాంతాలను సురక్షిత జోన్లుగా ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. అయితే ఉత్తర గాజాతో పాటు దక్షిణ ప్రాంతాలపైనా ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నది. దక్షిణ రీజియన్‌లోని ఖాన్ యూనిస్ పట్టణంలో వేలాది మంది ఆశ్రయం పొందుతున్న ఓ భవనంపై బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో 10 మందికి పైగా మరణించగా, దాదాపు 50 మందికి గాయాలైనట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పాలస్తీనియన్లు తమకు ఎక్కడా భద్రతా లేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు.



*తమిళనాడులోని రామేశ్వరంలో గురువారం భారీ వర్షం కురిసింది. రామనాథస్వామి ఆలయంలోకి వరద నీరు చేరడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వరద నీటిలోనే నడుచుకుంటూ స్వామివారిని దర్శించుకున్నారు.*

## చిక్కుల్లో మహువా

న్యూఢిల్లీ : పార్లమెంటులో ప్రశ్నలు అడగడానికి డబ్బు వసూలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాకు బిజినెస్‌మన్ దర్శన్ హీరానందానీ గురువారం గట్టి షాక్ ఇచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని టార్గెట్ చేయడానికి ఏకైక మార్గం పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీకి వ్యతిరేకంగా ప్రశ్నలను అడగడమేనని ఆమె భావించారని తెలిపారు. అదానీపై ప్రశ్నలను రూపొందించేందుకు ఆమె తన పార్లమెంటు లాగిన్ ఐడీని, పాస్‌వర్డ్‌ను తనకు ఇచ్చారని తెలిపారు. దీని కోసం తమకు పాత్రికేయులు, ప్రతిపక్ష నేతలు, అదానీ కంపెనీల్లో గతంలో పని చేసిన ఉద్యోగులు సహకరించారని తెలిపారు. ఆమె తన వద్ద విలువైన వస్తువులను కూడా తీసుకున్నారని, ప్రతిపక్షాలు పరిపాలించే రాష్ర్టాల్లో తన వ్యాపారానికి ఆమె ద్వారా సహకారం అందుతుందనే ఉద్దేశంతోనే తాను ఆమెకు సహకరించానని తెలిపారు. ఈ వివరాలను ఆయన అఫిడవిట్ రూపంలో సమర్పించారు.

## మరాఠా కోటా ఉద్యమకారుడు ఆత్మహత్య

ముంబై: మరాఠా కోటా కోసం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ముంబైలోని బాంద్రా ప్రాంతంలో ఫ్లైఓవర్‌కు ఉన్న స్తంభానికి ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. విద్య, ఉద్యోగాల్లో మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ మహారాష్ట్రలో జరిగిన ఉద్యమంలో సునీల్ కవాలే (45)చురుగ్గా పాల్గొనేవాడు. అయితే ఎంత ఉద్యమించినా బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడంతో ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. బుధవారం రాత్రి బాంద్రా ప్రాంతంలోని ఓ ఫ్లైఓవర్ వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనాస్థలంలో దొరికిన సూసైడ్ నోట్‌ను పరిశీలించగా మరాఠా రిజర్వేషన్ల కోసమే ఆత్మహత్య చేసుకున్నట్టు ఉన్నది. ఈ నెల 24న ముంబైలో మరాఠా రిజర్వేషన్ల సాధన కోసం అందరూ ఏకమవ్వాలని ఆయన లేఖలో కోరారు. మొదట రిజర్వేషన్లు.. ఆ తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని సునీల్ కవాలే లేఖలో ఉద్యమకారులకు సూచించారు.



## వంట రాకపోతే విడాకులా?

కొచ్చి: భార్యకు వంట రానంత మాత్రాన దానిని క్రూరత్వంగా పరిగణించలేమని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. దీన్ని కారణంగా చూపుతూ విడాకులు మంజూరు చేయాలంటూ ఒక వ్యక్తి చేసిన అభ్యర్థనను తిరస్కరించింది. తన భార్యకు వంట చేయడం రాదని, తనకు భోజనం వండిపెట్టకుండా తనపట్ల క్రూరంగా వ్యవహరిస్తున్నందున విడాకులు మంజూరు చేయాలంటూ ఒక వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను కేరళ హైకోర్టు విచారించింది. చట్టపరంగా దంపతులైన తర్వాత అందులో ఒకరు వివాహాన్ని రద్దు చేసుకోవడానికి తీసుకున్న ఏకపక్ష నిర్ణయం చెల్లదని, విడాకులు కోరడానికి గల సహేతుకమైన కారణాన్ని చూపాలని ధర్మాసనం పేర్కొంది. 'వంట చేయడం రాకపోతే అది క్రూరత్వం ఎలా అవుతుందని' ధర్మాసనం ప్రశ్నించింది.




## 14 వేల మందికి నోకియా ఉద్వాసన!

హెల్సింకి: ప్రముఖ టెలికం కంపెనీ నోకియా ఉద్యోగులను తొలగించే పనిలో పడింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులలో 16 శాతం లేదా 14 వేల మంది ఉద్యోగులను తొలగించాలని ప్రణాళిక సిద్ధం చేసినట్టు గురువారం సంస్థ సీఈవో పెక్కా లండ్‌మార్క్ ప్రకటించారు. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో సంస్థ అమ్మకాలు, లాభాలు గణనీయంగా తగ్గుముఖం పట్టడంతో ఖర్చు తగ్గించుకుంటూ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఉద్యోగుల సంఖ్యను కుదించాలని భావిస్తున్నట్టు సంస్థ పేర్కొంది. దీని ప్రకారం 2026 నాటికి ప్రస్తుతమున్న 86 వేల మంది ఉద్యోగులను 72వేలకు తగ్గిస్తామని ఆయన చెప్పారు. మరోవైపు గూగుల్ కూడా తమ న్యూస్ విభాగంలో 50 మంది ఉద్యోగులను తొలగించనున్నది.



## కూలీ ఖాతాలో రూ.221 కోట్లు

బస్తీ : అతడో కూలీ. రోజూ పనికి వెళితే కానీ పూట గడవని స్థితి. అలాంటి వ్యక్తి బ్యాంక్ ఖాతాలో ఏకంగా 221 కోట్ల రూపాయలను గుర్తు తెలియని వ్యక్తులు డిపాజిట్ చేశారు. ఇంకేముంది ఇన్ని కోట్ల రూపాయల లావాదేవీలు జరిపినందుకు ఐటీ కట్టాలంటూ ఆదాయపు పన్ను శాఖ అధికారులు నోటీసులు పంపడంతో అతడు లబోదిబోమంటున్నాడు. బస్తీ జిల్లాలోని బర్టానియా గ్రామానికి చెందిన నిషాద్ అనే రోజు కూలీ బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల ఐటీ ఆఫీస్‌కు రావాలంటూ తనకు నోటీసులు వచ్చాయని, అయితే వాటి గురించి తనకు అవగాహన లేదని చెప్పాడు. కొద్ది ఏండ్ల క్రితం తన పాన్ కార్డును పోగొట్టుకున్నానని, బహుశా దానితో ఎవరైనా తనపేరుతో అక్రమాలకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు.




## త్వరలో ఒకే సిమ్‌పై రెండు వాట్సాప్‌లు

న్యూఢిల్లీ: ఒకే సిమ్‌పై రెండు వాట్సాప్ ఖాతాల్లోకి లాగిన్ అయ్యే సదుపాయం త్వరలో అందుబాటులోకి రానుంది. వాట్సాప్ మాతృసంస్థ 'మెటా' సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ తాజాగా ఈ విషయం వెల్లడించారు. ప్రస్తుతం ఒక సిమ్‌పై రెండు వాట్సాప్ ఖాతాల్ని కలిగి ఉండటానికి అవకాశం లేదు. రెండో సిమ్ లేదా రెండో ఫోన్ వాడాల్సిందే. ఒకే ఫోన్‌లో ఒకే యాప్‌లో రెండు వాట్సాప్ ఖాతాల్ని వాడుకునే సరికొత్త ఫీచర్‌ను తెస్తున్నామని, ఇది ఆండ్రాయిడ్ యూజర్లకు మరికొద్ది రోజుల్లో అందుబాటులోకి వస్తుందని జుకర్‌బర్గ్ తెలిపారు. వాట్సాప్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి కొన్ని సెకన్లలలో రెండో అకౌంట్‌ను ఓపెన్ చేయవచ్చునని, రెండు ఖాతాలకు ప్రైవసీ, నోటిఫికేషన్ సెట్టింగ్స్ ఒకే విధంగా ఉంటాయని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

## ఈడీ అధికారాలపై మరోసారి సుప్రీంకోర్టు విచారణ



న్యూఢిల్లీ, అక్టోబర్ 19: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్(ఈడీ) అసాధారణ అధికారాలపై సుప్రీంకోర్టు మరోసారి విచారణ జరపనుంది. ఇందుకు సంబంధించిన పిల్‌ను విచారించడానికి కోర్టు అంగీకారం తెలిపింది. గతేడాది జూలైలో ఈడీ అసాధారణ అధికారాలను దేశ అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. అయితే పౌర సమాజం, విపక్షాలు ఈడీకి ఉన్న అధికారాలను తీవ్రంగా విమర్శిస్తూనే ఉన్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికే ఈడీ ద్వారా దాడులు చేయిస్తున్నదని.. ఇందుకు సంబంధించిన కేసుల్లో నేరారోపణ రుజువైన కేసులు తక్కువని విపక్షాలు వాదిస్తున్నాయి. ఇటీవల రాజ్యసభలో ఆర్థిక శాఖ వెల్లడించిన లెక్కల ప్రకారం గత ఎనిమిదేండ్లలో ఈడీ 3,010 మనీ లాండరింగ్ సోదాలను నిర్వహించగా, అందులో కేవలం 23 మంది నిందితులు మాత్రమే దోషులుగా తేలారు.